క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు పరిశీలన

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌యంటీ శాతవాహననగర్‌లో రూ.55 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదర్‌నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలన్నారు. డివిజన్ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాలనీ వాసులు అందే నర్సింహ, రామ కోటేశ్వరరావు, యాదిరెడ్డి, మదన్‌మోహన్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అందరూ పోరాడాలి

- సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర
- సీఐఎస్‌ఓ కౌన్సిల్ ప్రారంభం

రాయదుర్గం: చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్స్ (సీఎస్ఐఓ) కౌన్సిల్‌ను లాంఛనంగా ప్రారంభించినట్లు సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర శనివారం ప్రకటించారు. ఐఎస్ఏసీఏ హైదరాబాద్ చాప్టర్, హెచ్ఐసీసీ, ఏసీఎఫ్ఈ, హైదరాబాద్ సర్టిఫైడ్ ఫ్రాడ్ ఎగ్జామినర్స్ అసోసియేషన్, ఓడబ్ల్యూఏఎస్‌పి హైదరాబాద్ ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో సైబర్ సమ్మిట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ సీఐఎస్ఓ కౌన్సిల్‌ను ఓ విప్లవంగా అభివర్ణించారు. సైబర్ సమ్మిట్ ద్వారా వివిధ సంఘాలను ఏకతాటిపైకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో సైబర్ నేరాలు, సవాళ్ళు పెరిగిపోతున్నాయని, ఈ నేరాలపై అందరూ పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు సైబర్ నిపుణులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ మున్సిపల్, మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 11 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా మంజూరైన 11 లక్షల రూపాయల చెక్కులను అమీన్‌పూర్ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి,ఎంపీపీ దేవానందం, మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి శనివారం పంపిణీ చేశారు.నిరుపేదలకు ఆడపిల్లల వివాహం భారం కాకూడదన్న లక్ష్యంతో సీఎం ఈ పథకాలను ప్రవేశ పెట్టారని తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన.. బస్సులు బంద్

- డిపోలకే పరిమితమైన ఆర్టీసీ బస్సులు
- హెచ్‌సీయూ, మియాపూర్ డిపోల్లో ఆగిన 257 బస్సులు
- నాలుగు గంటలపా ప్రైవేటు వాహనాల్లో అధిక చార్జీలు వసూలు
- మళ్లీ బస్సులు రోడ్డెక్కడంతో ఊపిరి పీల్చుకున్న ప్రయాణికులు



మియాపూర్ ఆర్టీసీ డిపో ముందు నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

రాయదుర్గం/మియాపూర్: ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలనే ప్రభుత్వ నిర్ణయంతో బిల్లును గవర్నర్ ఆమోదం కోసం పంపగా దాన్ని వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ ఉద్యోగులు శనివారం నిరసన తెలిపారు. దీంతో గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ, మియాపూర్‌లోని ఆర్టీసీ డిపోలలో బస్సులన్నీ తెల్లవారుజామునుంచి ఉదయం 9 గంటలవరకు డిపోలకే పరిమితమయ్యాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతూ ప్రైవేటు వాహనాల్లో రాకపోకలు సాగించారు. కాగా హెచ్‌సీయూ డిపో మేనేజర్ ఎం మురళీధర్‌రెడ్డి ఫోన్ ద్వారా ఇతర అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకున్నారు. ఆయా డిపోల అధికారుల పర్యవేక్షణలో అన్ని రూట్లలో ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకున్నారు.

- హెచ్‌సీయూ ఆర్టీసీ డిపోలో 136 బస్సులు డిపోకే పరిమితమయ్యాయి
- డిపో ముందు 732 మంది ఉద్యోగులు నిరసనలో పాల్గొన్నారు.
- మియాపూర్‌లోని ఆర్టీసీ డిపోలో 121 బస్సులు డిపోలోనే ఉండిపోయాయి
- డిపో పనిచేసే 650 మంది ఉద్యోగులు నిరసనలో పాల్గొన్నారు.

డిపోల ఎదుట ఉద్యోగుల నిరసన

గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో ముందు

- ఆర్టీసీ సంస్థను వెంటనే ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు.
- ప్రభుత్వం పంపిన బిల్లుకు గవర్నర్ వెంటనే ఆమోదం తెలపాలని కోరారు.
- అలాగే 2013 వేతన సవరణ అరియర్స్ బాండ్ల డబ్బులు కూడా వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ పత్రాలను లబ్ధిదారుల కుటుంబసభ్యులకు అందిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోందని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న వారికి సీఎంఆర్ ఎఫ్ ఎల్‌ఓసీ పత్రాలను లబ్ధిదారులకు శనివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్‌ఎఫ్ పేద, మధ్య తరగతి ప్రజలకు వరంలాంటిదన్నారు. కొండాపూర్‌లోని సిద్ధిఖీనగర్‌లోని నాగరాజుకు లక్ష రూపాయల, శేరిలింగంపల్లి తారానగర్‌లోని అన్నపూర్ణకు లక్ష రూపాయల, హఫీజ్‌పేట్ ఆల్విన్‌కాలనీ వాసి పద్మావతికి రెండు లక్షల, గచ్చిబౌలిలోని రాయదుర్గంలోని శోభకు రూ.2.50 లక్షల సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ పత్రాలను వారి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కాశీనాథ్‌యాదవ్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సైబర్ మోసం.. నగదు రెట్టింపు ఇస్తామని ఆశ చూపి..

- రూ. 4,27,580 లక్షలు పోగొట్టుకున్న బాధితురాలు

పటాన్‌చెరు టౌన్: అపరిచిత వ్యక్తి నుంచి టెలిగ్రామ్‌కు వచ్చిన మెసేజ్‌కు స్పందించిన ఓ మహిళ రూ.నాలుగు లక్షల 27 వేలు 580 పోగొట్టుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు పట్టణం శివారులోని ఏపీఆర్ కాలనీకి చెందిన ఓ మహిళకు జూలై 16వ తేదీన టెలిగ్రామ్ కు జాబ్ ఆఫర్ అంటూ వచ్చిన మెసేజ్ కు స్పందించి, తన వివరాలను నమోదు చేసింది.దీంతో అపరిచిత వ్యక్తి బాధిత మహిళలకు యాప్ టూల్ లో ఐడి క్రియేట్ చేసి ఇచ్చాడు. దీంతో బాధితురాలు పలు దఫాలుగా నగదు పెడుతూ వచ్చింది.తాను పెట్టిన నాలుగు లక్షల 27 వేలు 580 గాను వ్యక్తి ఇచ్చిన పోర్టల్ లో రూ.10 లక్షల జమ అయినట్టు చూపించింది. దీంతో బాధితురాలు తాను పెట్టిన నగదుతో పాటు రెట్టింపైన నగదు ఇవ్వాలని అపరిచిత వ్యక్తిని అడగడంతో స్పందించలేదు. దీంతో బాధితురాలు తాను మోసపోయినట్లు గుర్తించి జులై 20 తేదీన సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. శనివారం పటాన్ చెరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా ఈ మేరకు పోలీసు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డివిజన్ అభివృద్ధికి కృషి

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నానని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని ఎస్సీ బస్తీ స్మశాన వాటికకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారడంతో వర్షపు నీరు నిలిచి అంత్యక్రియలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని ఎస్సీ సంఘం శనివారం కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన కార్పొరేటర్ దారిని పరిశీలించారు. మరమ్మత్తులు చేయించి త్వరలోనే స్మశాన వాటికకు వెళ్లేందుకు సీసీ రోడ్డు వేయిస్తామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు.

భారతదేశ చరిత్రను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి



కార్యక్రమంలో రాజకీయ విశ్లేషకుడు శాంతాను గుప్త, గౌతమ్ చికర్‌మనే, మోనికా హలన్, నీటి యోధురాలు కల్పనా రమేష్ తదితరులు

మాదాపూర్: భారతదేశ చరిత్రను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని రాజకీయ విశ్లేషకుడు శాంతాను గుప్త పేర్కొన్నారు. మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో శనివారం భారత ఉవాచ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వక్తలు పలు అంశాలపై చర్చించారు. శాంతాను గుప్త మాట్లాడుతూ రామాయణ పాఠశాల గురించి వివరించారు. కళా చరిత్రకారుడు చిత్రమాధవన్ దేవాలయాలు- నాగరికత యొక్క నిధి అనే అంశంపై ప్రసంగించారు. నాగరికత మూలాల విలువలను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని సాయిదీపక్ తెలిపారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యాఖ్యాత అనురాగ్ సక్సేనా, విదేశీ వ్యవహారాల నిపుణుడు గౌతమ్ చికర్‌మనే, ఫైనాన్స్ రైటర్ మోనికా హలన్, నీటి యోధురాలు కల్పనా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ దూబే కాలనీలో కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ శనివారం పర్యటించారు. కాలనీవాసులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ కాలనీల్లో మౌలిక వసతులకు పెద్దపీట వేస్తున్నామన్నారు. రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను పూర్తి స్థాయిలో చేపడతామన్నారు. కార్యక్రమంలో ఏతం సునీల్, దూబే కాలనీ అధ్యక్షులు రితేష్ దూబే, మాజీ అధ్యక్షులు అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మునియా నాయక్, నాయకులు యాదగిరి, గోపాల్‌యాదవ్, లక్ష్మణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన భరతనాట్యం

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం బెంగుళూరుకు చెందిన ప్రముఖ కళాకారిణి అర్చన భరతనాట్యంతో సందర్శకులను అలరించింది. ఇందులో పుష్పాంజలి, గణేశస్తుతి, దేవీ స్తుతి, దేవర్నామ, అన్నమాచార్య కృతి అంశాలను ప్రదర్శించింది. హైదరాబాద్‌కు చెందిన భరతనాట్య కళాకారిణి శ్రీవిద్యఅనిష్ నృత్యాంశాలను ప్రదర్శించారు. ఇందులో శ్రీవిఘ్న రాజం భజే, శ్రీ అర్ధనారీశ్వరం, దేవర్నామ, తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు.

నేడు బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం

రామచంద్రాపురం (పటాన్‌చెరు): రామచంద్రాపురం మండల బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు బ్రాహ్మణ సంఘం నాయకులు తెలిపారు. పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉదయం 8 గంటలకు కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ప్రత్యేక పూజలు, చిన్నారులతో సంస్కృతిక కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

ఆకట్టుకుంటున్న ప్లాస్టిక్, హిప్‌లెక్స్- 2023 ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్‌లో.. ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారు చేసిన రోడ్డు



ఎగ్జిబిషన్‌లో ప్లాస్టిక్ వాటర్ పెట్ బాటిల్స్‌తో తయారు చేసిన దుస్తులు

మాదాపూర్: మాదాపూర్ హైటెక్స్‌లో నిర్వహిస్తున్న ప్లాస్టిక్ ఎక్స్‌పో, హిప్‌లెక్స్- 2023 ఎక్స్‌పో సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారు చేసిన ఉత్పత్తులు ఆకర్షణగా నిలుస్తున్నాయి. శనివారం సందర్శకులు ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన ఉత్పత్తులు, యంత్రపరికరాలను గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఎగ్జిబిషన్‌లో 400 మంది తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు. ఈ ప్రదర్శన సోమవారంతో ముగియనుంది. బిజినెస్ విజిటర్స్‌కి ఉచితం, మిగిలిన వారికి రూ.300 ప్రవేశ రుసుము.ఉదయం 10గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఓటరు నమోదు ప్రత్యేక డ్రైవ్ ప్రారంభం



మై హోమ్ జువెల్ అపార్ట్‌మెంట్‌లో ఓటర్ నమోదును పరిశీలిస్తున్న డీసీ వంశీకృష్ణ



ఖాజాగూడలోని జైన్ కార్ల్‌టన్ క్రీక్ అపార్ట్‌మెంట్స్‌లో... అధికారులు

రాయదుర్గం: గచ్చిబౌలి, కొండాపూర్ డివిజన్లలోని గేటెడ్ కమ్యూనిటీలలో బీఎల్‌ఓలు, జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది ఓటరు నమోదు ప్రక్రియను శనివారం నిర్వహించారు. గచ్చిబౌలి డివిజన్‌లోని పోలింగ్ స్టేషన్-13 ప్రాంతంలోని ఖాజాగూడ జైన్ కార్ల్‌టన్ క్రీక్ అపార్ట్‌మెంట్స్ , కొండాపూర్ డివిజన్‌లోని జాగృతి కాలనీలో కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో కలిసి ఈ ప్రక్రియను నిర్వహించారు. ఓటరు నమోదు, తొలగింపు, ఫారమ్ 6, 8లను అందించారు.

చందానగర్ సర్కిల్‌లో..

హఫీజ్‌పేట్ : చందానగర్ సర్కిల్ పరిధిలోని రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీలలో ఓటరు నమోదు ప్రత్యేక ప్రచార కార్యక్రమం శనివారం ప్రారంభమైందని డీసీ వంశీకృష్ణ పేర్కొన్నారు. మొదటి రోజు మదీనాగూడలోని మై హోమ్ జువెల్ అపార్ట్‌మెంట్‌లోని కమ్యూనిటి హాల్‌లో, దీప్తిశ్రీనగర్‌లలో డ్రైవ్ నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి అనూహ్య స్పందన వస్తుందన్నారు. కాగా 10 రోజుల పాటు నూతన ఓటర్ల నమోదు, సవరణలు ఓటర్ల జాబితాలో మార్పులు చేసుకోవడం కోసం రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీలలో బీఎల్‌ఓ టీంలు రానున్నారని వివరించారు. ఓటరు నమోదు, జాబితాలో సవరణలు, మార్పుల ప్రక్రియలో ఆన్‌లైన్ ద్వారా నమోదు చేయబడుతాయన్నారు. ప్రజలందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



నృత్యార్చన

మాదాపూర్: కళాకారులు కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించి అలరించారు. మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో ప్రతి శనివారం నిర్వహించే కార్యక్రమాలలో భాగంగా లయ డ్యాన్స్ అకాడమీ గురువు టి.పద్మలత శిష్యబృందం కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. ఇందులో విజ్ఞాన వినాయకకొతం, ఆదివో అల్లదివో, శిరుత నవ్వులవాడే, ముద్దుగారే యశోద తదితర అన్నమయ్య కీర్తనలకు నృత్యం చేశారు. కళాకారులు ఈ. అక్షర, జి. అక్షర, జె.తేజస్విని, కృతిక, నక్షత్ర, నికిత, సుష్మ, శాన్వి, యశస్విని, చిన్మయి, శ్రావ్య, తన్వి, సంజిన, మేఘన, సృజని, ద్విష, సహస్ర, ప్రణవి పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ శోభరాజు కళాకారులకు జ్ఞాపికలను అందజేసి సన్మానించారు.

ఉత్సాహంగా తైక్వాండో పోటీలు

గచ్చిబౌలి: తైక్వాండో పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో 7వసౌత్-ఏషియన్, 18వ సౌత్-వెస్ట్ జోనల్ తైక్వాండో ఐటీఎఫ్ చాంపియన్‌షిప్-2023 పోటీలు నిర్వహిస్తున్నారు. ఆదివారం వరకు ఈ పోటీలు కొనసాగుతాయి. తైక్వాండో అసోసియేషన్ తెలంగాణ, తైక్వాండో అసోసియేషన్ కర్నాటక, తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ ఇండియా, యగ్న-యూత్ అవేకెనింగ్ ఫర్ గ్లోరియస్ నేషన్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. రెండవ రోజు వరకు జరిగిన పోటీలలో సాధించిన పతకాలను శనివారం ప్రకటించారు. సౌత్ వెస్ట్ ఇండియా తైక్వాండో పోటీలలో కర్నాటక రాష్ట్రం అత్యధిక పతకాలను సాధించింది. అదేవిధంగా సౌత్ ఏషియన్ పోటీలలో భారత్ అత్యధిక పతకాలను సాధించింది.

ఎమ్మెల్యేకు పరామర్శ

పటాన్‌చెరు: పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని మంథని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు, అరబిందో ఫార్మా మేనేజింగ్ డైరెక్టర్ నిత్యానంద రెడ్డి, బిత్తిరి సత్తిలు పరామర్శించారు. శనివారం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిని కలిసి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

సీపీఆర్‌పై అవగాహన

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో గుండె సంబంధిత సీపీఆర్, ఫస్ట్ ఎయిడ్‌పై శనివారం సిబ్బందికి అవగాహన కల్పించారు. ఉస్మానియా మెడికల్ కాలేజ్ హైదరాబాద్ వైద్య బృందం , యూనిట్ మెడికల్ ఆఫీసర్ జ్యోతిబాపు సమక్షంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని బెటాలియన్ కమాండెంట్ సీ సన్నీ పర్యవేక్షణలో సాగింది. ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో 8వ బెటాలియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: క్యాబ్ డ్రైవర్ అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఈవి రమణ కథనం ప్రకారం..అమీన్‌పూర్ పరిధిలోని భవానీపురం కాలనీకి చెందిన సంబె ప్రవీణ్ కుమార్(28) క్యాబ్‌డ్రైవర్. ఆన్‌లైన్‌లో బెట్టింగ్ గేమ్ ఆడే అలవాటు ఉన్న ప్రవీణ్‌కుమార్ అప్పుల పాలయ్యాడు. అప్పు ఇచ్చిన వారు ఇంటికి వస్తుండడంతో పది రోజులు పాటు బయటకు వెళ్లి వచ్చేవాడు. ఈ క్రమంలో జులై 29వ తేదీన డ్రైవింగ్‌కు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుండి వెళ్లిన ప్రవీణ్ కుమార్ తిరిగి రాలేదు. దీంతో భార్య ప్రభావతి తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికిన భర్త ఆచూకీ లభించక పోవడంతో శనివారం భర్త అదృశ్యం పై ఫిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో వాకింగ్‌కు వెళ్లి..

వాకింగ్‌కు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ పరిధిలోని బీఎస్‌ఆర్ కాలనీకి చెందిన బొస వెంకటేశం(60) మతిస్థిమితం లేదు. ఎర్రగడ్డ ఆసుపత్రిలో చికిత్స చేయించి 2వ తేదీన ఇంటికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో నాలుగో తేదీ రాత్రి వాకింగ్ కి వెళ్తున్నానని వెళ్లిన వెంకటేశం తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల విచారించినా ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం తండ్రి అదృశ్యంపై కుమారుడు అభిలాష్ ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.